వీరవనిత

[లేక]

నరకాసురవధ

శ్రీమతి ఆదుర్తి భాస్కరమ్మగారు

నానావిధ ఫలపుష్ప భరితమై కనులపండువొనర్చు యుద్యానవనములో నొక లతామండపము క్రింద చంద్రకాంతశిలావేదికపై వెనుకకుజేరబడి చేతిమీద శిరమునానుకొని దీర్ఘాలోచనపరుడై కూర్చునియున్నాడు శ్రీకృష్ణుడు. సూర్యుడప్పుడే యస్తమించుచుండుటచేత నీరెండపడి యుద్యానవనమునందలి చెట్లకొక క్రొత్తయంద మేర్పడుచున్నది. సుగంధపూరితమైన పిల్లవాయువులు చల్లగా వీచుచున్నవి. పక్షులు మధుర రుతములుచేయుచు తమతమ గూళ్లను చేరుచున్నవి. ఆ సాయంకాలము వర్ణనాతీతమై యతి మనోహరముగానున్నది. యోగనిద్రాపరవశుడైయున్న యోగివలె శ్రీకృష్ణుడు ఈ యానందము ననుభవించుట లేదు. తదేక ధ్యానములో నిమగ్నుడైయున్నాడు.

కృష్ణుని వెదకికొంటూ సత్యభామ అక్కడకు వచ్చింది. ఏకాగ్రచిత్తుడై వంటరిగానున్న శ్రీకృష్ణుని చూసింది. "ఏదో మళ్లీ పుట్టి మునిగినది. లేకపోతే ఎప్పుడూ నవ్వుతో, ఇతరుల నవ్విస్తో, ఎంతో సరదాగా, సంతోషంగానుండే శ్రీకృష్ణుడిట్లువంటరిగా ఆలోచనాతత్పరుడై కూర్చోడు." అని తనలో తాననుకొంటూ వెనుకనుండి కృష్ణుని సమీపించి కండ్లు మూసింది.

కృష్ణుడు: ఎవరువారు, సత్యభామా ?

సత్యభామ: కృష్ణా! ఏమిటిది అంత దీర్ఘంగా ఆలోచిస్తొన్నావు ? మళ్లీయేదైనా వచ్చిందా యేమిటి? ఎక్కడేది వచ్చినా నీకే కావాలి.

కృష్ణుడు: నాకు కాకపోతే మరెవరికి సత్యా? లోకమంతను పాలించేవాడిని, పోషించేవాడిని, రక్షించేవాడిని నేను. ప్రజల సౌఖ్యమే నాసౌఖ్యము. వారి దుఃఖమే నాదుఃఖము. వారంతా నన్నే నమ్ముకొని నా యొద్దకు వచ్చి మొరపెట్టుకొంటూంటే వారిమొరవిని వారి కష్టములు తొలగించకపోతే నేనుండి యేమి ప్రయోజనము?

సత్య: ఈ సారి యేమి వచ్చింది ?

కృష్ణుడు: ఈ సారి అన్నిటికన్న అతిదుఃఖకరమైన విషయమే వచ్చింది. నా కన్నకుమారునే చంపవలసివస్తోంది.

సత్య: కన్న కుమారునా! ఎవరతడు? ప్రద్యుమ్నుడు కాడు కదా కొంపతీసి ?

కృష్ణుడు: ప్రద్యుమ్నుడెందుకవుతాడు ? మహా పతివ్రతయైన రుక్మిణి గర్భవాసమున జన్మించి ఆదర్శవంతమైన క్రమశిక్షణలో పెరిగినవాడు ప్రద్యుమ్నుడు. నా తరువాత నా యంతటివాడు.

సత్య: మరెవరైయుంటారు ?

కృష్ణుడు: నీవు వినలేదా ? సత్యా! నరకాసురుడు అతని పేరు. అతడు భూదేవి వలన నాకు జన్మించినవాడు. పరమ దుర్మార్గుడై ప్రజలను, మునులను చాలా బాధలు పెడుతున్నాడని తెలియుచున్నది. అనేకమంది రాకొమరులను తీసికొనివచ్చి చెరలోబెట్టి రోజున కొకరి చొప్పున కాళికిబలి యిచ్చుచున్నాడట. స్త్రీలను చెరబడుతున్నాడట. అతడు చేయుదుండగములు మాటలతో చెప్పుటకు వీలు కాదు. ప్రజలు, దేవతలు, అట్టుడికినట్లుడికి పోవుచున్నారు. వాడు చేయు దుండగములు వినుటకు నాకు చాలా కష్టముగా ఉంటోంది.

సత్య: ఎంత దుర్మార్గుడైనా కన్న కొడుకుగదా కృష్ణా! వానినేదో కొంచెము కోప్పడి దుర్మార్గములను మాన్పించాలిగాని చంపివేయడమేనా ?

కృష్ణుడు: కన్న కొడుకైతేమాత్రం దుర్మార్గుడు దుర్మార్గుడే. శరీరమందలి యొకవ్రేలిమీద వ్రణమై అది కుళ్లి శరీరమున కంతకూ నష్టముగొని రానున్నప్పుడు దానిని తీసివేయక నావ్రేలేకదా తీసివేయుటెట్లని యూరకున్నచో శరీర

మున కంతకూ కీడు కలుగును. ఇది కూడవట్టిదే. కోప్పడడము, నయమున భయమున బోధించడము అన్నీ జరిగాయి. ఎన్నిచెప్పినా వాడిదుష్ప్రవర్తన వాడు మానడములేదు. వాడికితోడుగా కొంతసైన్యముగూడా జేర్చుకొని తపస్సుచేయు మునులను, ఋషులను తనవలెనే దుర్మార్గులై తనజట్టుతో చేరవలయునని నిర్బంధించడం, ఇళ్లుతగుల బెట్టడం, దోచుకోవడం, ప్రజలను చిత్రవధ చేయడం, స్త్రీలను బాధించడం ఈ విధంగా చాలా అల్లరిచేస్తున్నాడు. అహింసాతత్పరులును, ధర్మమార్గానువర్తులును ఐన ప్రజలు వానినేమిచేయ జాలక నాయొద్దకు వచ్చి మొరపెట్టుకొనుచున్నారు.

సత్య : నరకాసురు డంతటి దుర్మార్గుడై ప్రజల నా విధముగా బాధించుచుండగా వానిని వెంటనే బరిమార్చక యింత కాల మెందుకూరకొంటివి కృష్ణా?

కృష్ణుడు : దేనికైనా కర్మపరి పక్వం కావాలి. ఎప్పటికైనా బుద్ధి వస్తుందేమోనని కొంత ఆలశ్యం చేశాను. ప్రజల నా విధంగా బాధిస్తూవుంటే నేను కలుగజేసి కొనుట యెందుకు వాళ్లేవాడికి తగిన బుద్ధి చెప్తారని కొంత యూరకొంటిని. ప్రజలువచ్చి నన్నుకోరనిదే యేలా కలుగజేసుకోనని కొంత యోచించితిని. వాడి దుర్మార్గము లోకానికి బాగా తెలిసి వారు విసిగివేసారకుండా వానిని జంపివేస్తే కృష్ణుడు చాలా న్యాయశీలుడు, ధర్మపరుడు, దూరదృష్టిగలవాడు యుక్తా యుక్త విచక్షణా పరుడు, అహింసా తత్పరుడు, అని నన్నెంతో గౌరవముగా చూస్తోన్న ప్రజలు, ఏదో చెడ్డగా ప్రవర్తించాడని కన్న కొడుకని యైనా చూడక పాపం నరకుని అన్యాయంగా చంపివేశాడని యనుకొంటారేమో, నిందిస్తారేమో, వారికి నాయందుగల నమ్మకము, గౌరవము పోతాయేమో నని కొంత జాగు చేయవలసి వచ్చినది.

సత్య : అయితే వానిమీదకు యుద్ధమునకు వెళ్ళక తప్పదా? కృష్ణా!

కృష్ణుడు : తప్పదు. అందుకే యింత దీర్ఘాలోచన. విచారమూను.

సత్య : యుద్ధానికి నాకు కూడా రావాలని యున్నది. నీతో నేనూవస్తాను.

కృష్ణుడు : సత్యా! యుద్ధమంటే యేమిటనుకొన్నావు? ఉద్యానవనములో విహరించుటనుకొంటివా? వీణమీటుతో శ్రావ్యముగా గానము చేయుటా? వినోద ప్రదర్శన మనియా నీయూహ. అంతఃపురము, ఉద్యానవనము తప్ప ప్రపంచ మెరుగని యమాయికవు, అబలవు, సుకుమారివి అయిన నీవు భయంకరమైన యుద్ధభూమినిజూచి భరింపగలవా? యుద్ధభటులొనర్చు భయంకరమోటు నినాదములను వినగలవా? తెగిపోయిన కాళ్లు చేతులు, అవయవ రహితములైన మొండెములు, మొండెముల నుండి వేరుపడిన తలకాయలు రక్త ప్రవాహములతో దొర్లుతూఉంటే నీవక్కడ నిలువగలవా? స్త్రీల మాన భంగమొనర్చె దుర్మార్గుల కంట స్త్రీలు పడవచ్చునా? ఇదేమి కోరిక సత్యా! స్త్రీలు కోరగూడని కోరిక కోరితివి? నీ సవతులెవరైనా వినిన నవ్విపోదురు. ఊరకుండుము.

సత్య : కృష్ణా! నాకేసిచూడు. నేను తక్కిన స్త్రీలవలెను, నీ తక్కిన భార్యలవలెను సాధారణ స్త్రీవలెనే కనబడుచుంటినా నీదృష్టికి? ఇంతకాలమునుండి చూస్తో నాశక్తి సమర్థతలు కనిపెట్టనేలేదా నీవు? నీవేనాసూక్ష్మగ్రాహివనికొంటినిగాని యింతగ్రహింపుశక్తి లేనివాడవని తలంచలేదు. నాతండ్రి సత్రాజిత్తు నన్ను, తక్కిన తండ్రులు తమ బాలికలను పెంచినట్లు, పెంచలేదు. పుత్రికనైనా పుత్రుడనైనా నేనొక్కతినే యగుటచేత ఆడపిల్లలకు చెప్పించవలసిన సంగీతసాహిత్య నృత్య చిత్రలేఖన మొదలగు లలితకళలతో బాటు మగబిడ్డలకు కావలసిన కత్తిసాము, విలువిద్య, రథము నడుపుట, గుఱ్ఱపు స్వారి, యుద్ధముచేయుట మొదలగు విద్యలనుగూడ నేర్పించెను కనుక నాకు యుద్ధమన్నా భయములేదు. ఊరకదూరము నుండి చూచుట మాత్రమే కాదు. అవసరమగుచో నీకు సహాయముగానుండి యుద్ధముకూడ జేసెదను.

కృష్ణుడు : సత్యా నీకెంతజెప్పినను వినకున్నావు. ఇంత సౌందర్యరాశివి, చాతుర్యవంతు రాలవునగు నీవు కంటబడిన

వీరవనిత [లేక] నరకాసుర వధ

యాదుర్మార్గులూరకొందురా ? నేనొకవేళ యుద్ధములో మూర్ఛపోవుటో, నిన్ను చూచుకొనుట కవకాశములేకుండాయుద్ధములో నిమగ్నుడనై యుండ వలసివచ్చుటో, ఒకవేళ రణరంగమున చనిపోవుటో సంభవించిన యెడల నీపని యేమిగాను ? నా ప్రాణమునకన్నా నెక్కుడుగా చూచుకొనుచున్న నాముద్దుల రాణిని భయంకరప్రదేశమునకు దుర్మార్గుల మధ్యకు తీసికొని వెళ్లుటకు నా మనసొప్పుటలేదు సత్యా ! పురుషసంతతి లేక పోవుటచేత ఏదో ముద్దుకొఱకు నీతండ్రి నీకుకొన్ని విద్యలు నేర్పించియుండ వచ్చును. ఊరక సరదాకు విద్యలు నేర్చుకొనుటకును, అతి భయంకరమైన, ఘోరమైన, కృత్రిమ పూరితమైన యుద్ధములో వాని నుపయోగించుటకును చాలా తారతమ్యమున్నది. నా మాటవిని నన్ను బలవంత పెట్టక, నిందించక నీ యీ తలంపును వదలుము.

సత్య : కృష్ణా! నీవు చెప్పేమాటలన్ని అబలలు, అమాయికలు, సుకుమారులు, ప్రపంచజ్ఞానము లేనివారలు, కేవలము పురుషులమీదనే యాధారపడ వలసినవారు అని యనుకొనే సాధారణ స్త్రీల విషయములో చెప్పవలసినవి. ఏ విధమైన ఆయుధ సహాయములేకున్ననూ, యుద్ధ సంగతులేవీ యెరుగకున్ననూ సీత, దమయంతి మొదలగువారు కేవలము మనోబలముచేతను, సాత్విక నిరోధముచేతను పరమ దుర్మార్గులు, దుష్టులునగు శత్రువుల జయింపగలిగియుండగా వానితోబాటు ఆయుధముల యుపయోగము, రణకౌశలము నెరిగియున్న నా కొఱకా నీవు భయపడునది ? అర్ధాంగినగు నేను నీప్రక్కనుండగా నీకు ప్రాణాపాయమా ? కృష్ణా! సామాన్య మానవునివలె మాట్లాడుచుంటివేల ?

చివరకు కృష్ణునకు సత్యభామను యుద్ధమునకు తీసికొని వెళ్లక తప్పినదికాదు. యుద్ధభూమిలో నరకాసురుడు తన సైన్యముతో నతిభయంకరుడై విహరించుచుండెను. ఎంత నేర్పగాకృష్ణుడతనితో యుద్ధమొనర్చుచున్నను నరకుని బాణమొకటి యాతనికి గాఢముగా తగులుటచేత నతడు మూర్ఛనొందెను. సత్యభామ యాతని రథమును దూరముగా గొనిపోయి యతనికి శైత్యోపచారములు చేయ భటుల కాజ్ఞనొసగి రణరంగమున ప్రవేశించి యతిచాతుర్యముతో శత్రువుల జెండాడుచుండెను. కనులు మిరుమిట్లు గొలుపు ఆమె సౌందర్యము, స్త్రీజనాతీతమగు నామెశౌర్యపరాక్రమ ధైర్య సాహసములు, యుద్ధ కౌశలము చూచి శత్రువులు ముగ్ధులై పోవుచుండిరి. ఆమె పై బాణమువేయుటకు వారికి చేతులాడుటలేదు. ఆమెనుండి దృష్టులను మరల్ప లేకున్నారు. అనేకమంది యుద్ధవీరులామె బాణముల కెరయై నేలగూలుచున్నారు. శ్రీకృష్ణునకు తెలివి వచ్చినది. సత్యభామ యేమయినదో యని యతని యాతురత. వేవేగముగా రథమును ఆహవరంగమునకు తోలించాడు. మహిషాసురమర్దనివలె తీవ్రముగా యుద్ధము చేయుచున్న సత్యభామను చూచి నప్పుడు అతని నేత్రములనే ఆతడు నమ్మలేక పోయాడు. కొంతసేపటి వరకూ అతనికండ్లు చీకట్లుకమ్మాయి. పిమ్మట ఆమె యుద్ధ నైపుణ్యము, యుద్ధముచేయు సమయములోనున్న ఆమె యొక్క వింత సౌందర్యము చూచి ఆశ్చర్యపోయాడు. అతి వయ్యారంగా తనయొద్దకూర్చుని ముద్దులుకుడుస్తూ సవతుల మీద ఈర్ష్య చూపించేకుసుమకోమలి ఆసత్యయేనా యీమె! ఎంత బలము ! ఏమి పరాక్రమము ! ఎట్టి శౌర్యము ! ఎంతటి ధైర్యము ! శత్రువులు గడగడలాడి పోతున్నారే ! నరకుడు చేష్టలుదక్కియున్నాడే ! అరె ! నరకుడు నేలగూలాడు !

తిరిగి యతను లేవ బోవుచుండగా శ్రీకృష్ణుని బాణము అతనిని తిరిగి యెప్పటికిలేవకుండా జేసినది. పరమదుర్మార్గుడగు నరకాసురు డంతమొందాడు. జయజయ ధ్వానములు మిన్నుముట్టాయి. ప్రజలందరూ దీపావళి పండుగ చేసికొన్నారు. పరమ దుర్మార్గుడగు నరకాసురుని వధించుటలో భర్తకు తోడ్పడి ప్రజల కష్టములను తొలగించిన వీరవనిత సత్యభామ.